కనుల పండువగా శోభాయాత్ర

పులివెందుల రూరల్ / టౌన్ : అయోధ్య రామ మందిరంలో నేడు బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయం నుంచి అన్ని పార్టీల రాజకీయ నాయకులు, మహిళాభక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శోభాయాత్ర నిర్వహించారు. ఆంజనేయస్వామి విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ఏర్పాటు చేసుకుని పట్టణంలోని ముద్దనూరు రోడ్డు, పూల అంగళ్లు, పార్నపల్లి రోడ్డు, పాతబస్టాండు పురవీధుల్లో స్వామి వారిని ఊరేగించారు. పులివెందుల మున్సిపాలిటీలోని మాలపల్లి, వెంకటాపురం, అచ్చవెల్లి, కొత్తపల్లి గ్రామాల నుంచి కూడా అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని కలశాలతో బార్లు తీరి ర్యాలీ నిర్వహించారు. అలాగే భక్తులు జై శ్రీరామ్ అంటూ బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామ జ్యోతులను వెలిగించాలని వారు సూచించారు.

కమలాపురంలో..

కమలాపురం : కమలాపురంలో శ్రీరామ భక్తుల శోభాయాత్ర కనుల విందుగా సాగింది. ఈనెల 22న అయోధ్యలో రామ మందిర ప్రతిష్టా మహోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం పట్టణంలో శ్రీరామ భక్తులు చేసిన శోభాయాత్ర కనుల విందుగా సాగింది. గ్రామ చావడి సమీపంలోని కోదండ రామాలయం నుంచి క్రాస్ రోడ్డు వరకు యువత బైక్ ర్యాలీ నిర్వహించారు. మహిళలు, భక్తులు వేలాదిగా తరలివచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. కోదండ రామాలయం వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పట్టణం నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి రామ భక్తులు వేలాదిగా తరలివచ్చి పాల్గొన్నారు.


పులివెందులలో ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు


పులివెందులలో కలశాలతో మహిళలు


కమలాపురం : శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం

వేంపల్లి : స్థానిక మెయిన్ బజార్‌లోని వీరాంజనేయ స్వామి ఆలయం నందు 108 సార్లు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. నేడు అయోధ్య రామాలయ ప్రారంభోత్సవానికి సంఘీభావంగా ఆదివారం భక్తులందరూ ఈ హనుమాన్ చాలీసా సామూహిక పారాయణంలో సుమారు 200 మంది పాల్గొని సంకల్పించారు. 108 సార్లు ఈ హనుమాన్ చాలీసా పారాయణం చదవడం వల్ల సర్వసంకటాలు, భయాలు, విపత్తులు, దుష్టశక్తులు, దృశ్ర్పచ భావాలు, శని ప్రభావం తొలగించబడి మనశ్శాంతి, మనోవాంఛపరిశుద్ధి, దైవిక శక్తి యొక్క తోడు, బుద్ధిబలప్రాప్తి లభిస్తాయన్నారు.

నేడు రామాలయాల్లో ప్రత్యేక పూజలు, గ్రామోత్సవాలు

లింగాల : అయోధ్య రామాలయంలో సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి విగ్రహ ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నారు. మండలంలోని అన్ని రామాలయాల్లో వేద పండితులచే సీతారామలక్ష్మణులకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించనున్నారు.

నేడు సీతారాముల కల్యాణం

వీరపునాయునిపల్లె : అయోధ్యలో రాముని విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం చేపడుతున్న శుభ సందర్భంగా సోమవారం మండలంలోని అన్ని గ్రామాల్లోని రామాలయాల్లో కల్యాణ మహోత్సవాలు, గ్రామోత్సవాలు, అన్నదానాలు నిర్వహించనున్నారు.

గడ్డివాములు దగ్ధం

పెద్దముడియం : పెద్దపసుపుల గ్రామంలో ఆదివారం రాత్రి యేమిరెడ్డి సంజీవరెడ్డికి చెందిన రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. ప్రమాదవశాత్తు మినుము, వరి గడ్డివాములకు మంటలు చెలరేగడంతో ఫైర్ సిబ్బంది వెంటనే వచ్చి మంటలను అదుపు చేయడంతో పక్కనే పదుల సంఖ్యలో ఉన్న గడ్డివాముల రైతులు ఊపిరి పీల్చుకున్నారు. గడ్డివాములు విలువ రూ.60 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం


ఆర్టీపీపీలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : ప్రజా సంక్షేమమే మా ధ్యేయం అని ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఆర్టీపీపీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ప్రజలకు ఏం చేశారో చెప్పాలన్నారు. కుల, మత బేధాలు చూడకుండా రాజకీయాలు చేయకుండా పార్టీలకు అతీతంగా పథకాలు అందించాలన్నదే సీఎం వైఎస్ జగనన్న లక్ష్యమన్నారు. ఎర్రగుంట్ల మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మైలవరం మండలంలోని అతిథి భవనంలో కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. త్వరలో ఎన్నికలను రానున్నాయని నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. గ్రామాల్లో ఉన్న నాయకులు సమన్వయంతో జగనన్న మంజూరు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ గత తెలుగుదేశం ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు వివరించాలని ఆయన కోరారు. దొంగ హామీలతో చంద్రబాబు నాయుడు కుట్రలు పన్నుతున్నారన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం


కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ ఉద్యోగులు

పులివెందుల రూరల్ : పట్టణంలోని సీఎస్ఐ చర్చి ఆవరణలో నూతనంగా నిర్మించిన వైఎస్ రాజమ్మ, వైఎస్ చిన్నకొండారెడ్డి మెమోరియల్ ఫంక్షన్ హాల్‌లో సరస్వతి ఆస్‌బెస్టాస్ మైనింగ్‌లో చేసిన ఉద్యోగస్తులు, కార్మికులతో కలిసి పూర్వ ఉద్యోగుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సమావేశాన్ని పారిశ్రామికవేత్త వైఎస్ ప్రకాష్‌రెడ్డి సతీమణి పద్మావతమ్మల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి వైఎస్ సోదరులు వైఎస్ ప్రతాప్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ జోసఫ్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైఎస్ ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ మైనింగ్‌లో పనిచేస్తున్నటువంటి ఉద్యోగస్తులు కార్మికులతోనే మైన్లు అభివృద్ధి చెందాయన్నారు. కలిసికట్టుగా అందరూ కష్టపడి పనిచేయాలన్నారు. సరస్వతి మైన్స్‌లో పనిచేసిన పూర్వ ఉద్యోగస్తులందరితో కలిసి మాట్లాడుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఉద్యోగస్తులకు కార్మికులు దుశ్శాలువాలు కప్పి సన్మానించారు. కార్మికులకు, ఉద్యోగస్తులందరికి బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో తొండూరు మండల వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి, ఉద్యోగస్తులు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో మార్పు

వల్లూరు : మండల పరిధిలో మంగళవారం నుంచి వ్యవసాయ విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ డేనియల్ జోసెఫ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వల్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఓల్టేజీని దృష్టిలో వుంచుకుని విద్యుత్ సరఫరాలో మార్పులు చేస్తున్నట్లు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని పెద్దపుత్త, గోటూరు, చెరువు కిందిపల్లె వ్యవసాయ ఫీడర్లకు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వ్యవసాయ మోటార్లకు త్రీ ఫేజ్ విద్యుత్‌ను సరఫరా చేస్తామని తెలిపారు. కాగా మండలంలోని పైడికాలువ సబ్‌స్టేషన్ పరిధిలో ప్రస్తుతం అమలులో వున్న వేళల ప్రకారం విద్యుత్ సరఫరా కొనసాగుతుందన్నారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గలేటిపల్లె కొత్తపేట సమీపంలోని గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

చెన్నూరు : మండలంలోని చిన్నమాచుపల్లె గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి దళితవాడ వరకు రూ.14 లక్షలతో జనరల్ నిధుల ద్వారా సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నమాచుపల్లె గ్రామ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తానని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామాలలో లక్షలాది రూపాయలతో డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా నేడు అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి సంక్షేమ పథకాలు ఎలాంటి పక్షపాతం లేకుండా, నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోనే జమచేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బుజిరెడ్డి, సుబ్బారావు, మోహన్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, శివ, చంటి, శ్రీనివాసులు, పుల్లారెడ్డి, బాలసుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం నిర్వహించే వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి హాజరవుతున్నారని ఆ పార్టీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన తెలిపారు.

నేడు గడప గపడకు మన ప్రభుత్వం

జమ్మలమడుగు : పట్టణంలోని భాగ్యనగర్, వెంకటేశ్వర కాలనీలలో సోమవారం సాయంత్రం జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మూలె సుధీర్‌రెడ్డి పాల్గొంటారని, పార్టీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ఒకటో వార్డు కౌన్సిలర్ ముల్లాజానీ తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

పులివెందుల టౌన్ / లింగాల : లింగాల మండలంలోని ఇప్పట్ల గ్రామంలో పులివెందులలోని ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో జాతీయ సేవా పథకంలో భాగంగా 7వ రోజు ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ బేగ్, కళాశాల అధ్యాపకులు నజ్మా, సాయిశ్రీనివాస్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వితరణ

పులివెందుల రూరల్ : ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవరచుకోవాలని జేసీఎస్ ఇన్‌చార్జి పార్నపల్లి కిశోర్ తెలిపారు. వార్డులో వీధిలైట్లు వెలుగక ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో ఆయన స్పందించి రూ.25 వేలు విలువ చేసే వీధి దీపాలను, విద్యుత్ ఉపకరణాలను, కేబుల్ వైర్లు, స్విచ్చులు, ఎల్ఈడీ లైట్లు, క్లాంపులు, పైపులను సచివాలయ లైన్‌మెన్ శంకర్‌రెడ్డికి అందజేశారు.

ఘనంగా మండల పూజ

లింగాల : మండలంలోని లోపట్నూతల గ్రామంలో 41 రోజుల క్రితం మారెమ్మ, మాలే గంగమ్మల ఆలయాలను ప్రారంభించారు. ఆలయాలను ప్రారంభించి మండలం కావడంతో ఆయా ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ మండల పూజ కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి వైఎస్ అభిషేక్‌రెడ్డిలు పాల్గొని పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందుకున్నారు. గ్రామప్రజలు అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అలవలపాటి నాగభూషణ్‌రెడ్డి విందు భోజనాలను ఏర్పాటు చేశారు. మండల వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి, బాబురెడ్డి, లింగాల మండల యూత్ కన్వీనర్ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కడప పార్లమెంటరీ కన్వీనర్లు సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మండల వ్యవసాయ సలహామండలి కమిటీ చైర్మన్ రమేష్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాలే గంగమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

నేడు రామయ్యకు పూజలు

పులివెందుల రూరల్ : అయోధ్య రామయ్య మందిరంలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ ఏ విధంగా జరుగుతుందో అదేవిధంగా పులివెందుల పట్టణంలోని శ్రీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో అయోధ్య రామయ్య మందిరం ఏర్పాటు చేసినట్లు ఆలయ అర్చకులు తెలిపారు. అయోధ్యలో రామమందిరాన్ని ఏ విధంగా అయితే నిర్మించారో అదేవిధంగా ఆ నమూనాను కూడా పట్టణంలోని వెంకటేశ్వర ఆలయంలో ఏర్పాటు చేశారు.